ఎం. రామకోటి

"ఇంక నీకూ యీ వూరికిసరి ... ఋణం తీరిపోయింది తల్లీ!"

అంతకంతకు దూరమవుతున్న విశాఖపట్నాన్నీ, సింహాచల పరిసరాల్నీ పరధ్యాన్నంగా రైలు కిటికీలోంచి గమనిస్తూ ఆ మాటలువిని వులికిపడి తిరిగి చూసేను.

నాకు యెదురుగావున్న బెర్తుమీద

యు:

ఒక ముసలాయినా, కూతురూ కూర్చున్నారు నావేపే చూస్తున్న ఆ అమ్మాయి నే నటు తిరగగానే మొహం తిప్పేసుకుంది. బెదిరి యెగరబోయే పిచ్చుక రెక్కల్లా ఆవిడ కనురెప్పలు రెపరెప కొట్టుకున్నాయి. కాళ్ళకి పసుపు, జడలో కనకాంబరాలూ, మెడలో నల్లపూసలూ, కాటుక కొలికలూ, చేతిలో మరచెంబూ చూస్తే ఆ అమ్మాయి అత్తారింటి కెళ్తోం దనుకున్నాను. ముసలాయన నెరసిన గెడ్డం పెరిగిపోయింది; నిగనిగలు వాడిపోయి, నల్లదనం విరిగిపోతూ వెలి

బూడిదలా వెలవెలబోతున్నాయి కంటి పాపలు. వడిలిపోతూ మీదపడే ముసలితనం బరువు మోయలేక గొంతుకమీద చర్మం వణికిపోయి వూగిసలాడిపోతోంది. గంధరేఖలూ, చిలాయిబొట్టూ చూస్తే పాతకాలం వాడనిపించింది.

స్లీపర్ కోచ్ లో నిలువుగా కిటికీదగ్గర రెండుబెర్తులున్నచోట దిగువబెర్తు దొరికింది నాకు; నామీద బెర్తులో చింపిరి గెడ్డం పంజాబీ గుర్రుపెడుతున్నాడు. నాకు యెదురుగావున్న అడ్డబెర్తులలో దిగువబెర్తుమీద కూర్చున్నారు. తండ్రీ కూతుళ్ళిద్దరూను. ఆ బెర్తుమీద కూర్చునే మూడోవాడు దూరంగా మరోచోట స్నేహితులతో పేకాడుకుంటున్నాడు. డ్రెయినుపైపు టెరిలీనుపేంటు వెనక జేబులో పాకెట్ బుక్కు దోపుకుంటూ గళ్ళగళ్ళ బుష్షర్టులోంచి వుబికేకండల చేత్తో ఏదో సినిమాపత్రికలో రంగుల బొమ్మని నలిపేస్తూ తదేకంగా చూసి తన్మయం చెందిపోతూ, వూలేసుకుంటూ పచార్లు చేస్తున్నా దొక విద్యార్థి భర్త ఆప్యాయంగా హల్వా నోటికందించబోతే, కళ్ళలో సిగ్గులు గుమ్మరించి, రింగులాడించుకుంటూ బాగుందిబాగుంది అన్నట్టు వంకనవ్వు నవ్వుతూ, మందలింపుగా మరోవేపు తిరిగిపోతోందో బెంగాలీ అమ్మాయి. కొత్తదంపతులనుకున్నాను – వాళ్ళని చూడగానే. ఆ అమ్మాయి బుగ్గలు ఎర్రబడ్డాయి; కళ్ళు కరుగుతున్నాయి. చేతిలో మరచెంబు గిరగిరా తిరిగిపోయింది. గిరుక్కున తిరిగిపోయి కిటికీలోంచి పరుగులెడుతున్న పచ్చటి పొలాలవేపు చూస్తోంది.

టెలిగ్రాఫ్ తీగలమీద పాలగువ్వ పెళ్ళికూతురులా తూగుతూ రంగులు సింగారించుకుని, నీలాల చీరకుచ్చిళ్ళాంటి తోక ఝళిపించి రైలుతో పందెంకట్టి పరుగులెత్త బోయింది. అలిసిపోయి వుస్సురని పొలంలో జొన్నకంకిమీద వాలిపోయింది. కంట్లో రాక్షసి బొగ్గుపడి భగ్గుమంది. చేతిరుమాలుతో కన్నొత్తుకుంటూ ఆ అమ్మాయివేపు చూసేను.

"నా బతుకలాగేవుంది... యెంతకని యెగరగలవే వెర్రిముండా" అని తనలోనే గొణుక్కుంది పాలగువ్వనిచూస్తూ ఆ అమ్మాయి. చూసిచూసి చీరకొంగుతో కళ్ళొత్తుకుంది.

కాఫీవేళకి తునిలో రైలాగింది.

"కాఫీ దొరుకుతుందేమో చూడు తల్లీ !" అని రైలాగిన కుదుపుకి లేచి ఆవలిస్తూ చిటికేసుకున్నాడు–కునుకుతున్న ముసలాయన.

"అదే నేనూచూస్తున్నాను నాన్నా... ఏయ్ కాఫీ...కాఫీ" అని కిటికీలోంచి తొంగిచూసి చేతులూపిందా అమ్మాయి. ఎవడూ వినిపించుకోలేదు.

నాకూ కాఫీతాగాలనిపించింది; ముసలాయన పడే యాతనచూసి జాలేసింది కిట్ లోంచి టిఫినుబాక్సూ ఫ్లాస్కూ తీసి

ప్లేట్లో వెన్నరాసిన రొట్టెముక్కలూ, కొంచెం కారప్పూసవేసి. ఫ్లాస్కు మూతలోకాఫీపోసి "ప్లాట్ఫారం కాఫీ తాగలేరు తాతగారూ ... యిది పుచ్చు కోండి" అని అందించేను.

ఒక్కక్షణం తెల్లబోయి నా మొహం లోకి చూసేడు ముసలాయన. యేవనుకున్నాడోయేంవో.

"మీకెందుకుబాబూ శ్రమ" అంటూ వెంటనే తేరుకుని మొహమాటపడ్డాడు.

"శ్రమకేవుందండీ— యిందులో ... ఫరవాలేదు తీసుకోండి చల్లారిపోతుంది" అంటూ కాఫీ టిఫినూ అందించేను

"కాఫీ చాలు బాబూ ... యేంతిన్నా అరగదు ... యీ కాఫీవుందే ... దీని తల్లికడుపు కాలా ... దీనికి లోకువై పోయేను బాబూ... సమయానికి లేక పోతే పిలకసాగదీసేస్తుంది...ఏం అల వాట్లో యేం బతుకులో" అంటూ అమృతంలా కాఫీని అవురావురుమంటూ అందుకున్నాడు.

"పోనీ మీరు తీసుకోండి" అని టిఫినుప్లేటు అమ్మాయికిచ్చేను.

ముందు వద్దని తరవాత థేంక్సండీ అని పుచ్చుకుంది. ఫ్లాస్కుమూత కడిగి తెచ్చిందాఅమ్మాయి. చదువుకుందామని పుస్తకం తీస్తున్నాను.

"నడుం లాగుతోందే అమ్మాయ్... పడుకోవాలమ్మా" అని యిటూ అటూ పర్లకాయిస్తున్నాడు ముసలాయన.

కూతురు పక్కనకూర్చుంటే పడు కోడం ఎలాగా అని తటపటాయిస్తున్న ముసలాయన యిబ్బందిచూసి—

"పోనీ నా బెర్తుమీద పడుకోండి... నేనక్కడ కూర్చుంటాను" అని లేవబోయేను.

"మీకు చాలా శ్రమకలిగిస్తున్నాను బాబూ."

"ఆ బెర్తు మానాన్నకి చాలదు...: కాళ్ళు ముడుచుకు పడుకోవాలి...నాన్నిక్కడే పడుకుంటాడు లెండి" అని తండ్రిని పడుకోమని ఆ అమ్మాయి నా బెర్తుమీదకొచ్చి కూర్చుంది.

ఒక్కక్షణం కలవరబడ్డాను: ముసలాయన దీనంగా నావేపుచూసి నడుం వాల్చేడు. ఆ అమ్మాయి కిటికీలోంచి చూస్తోంది. చదువుకుందామని పుస్తకం తెరిచేను. అక్షరాలు అలుక్కుపోతున్నాయి — రైలుకుదుపులో, మనసు గందరగోళంలో, ఆలోచనల చిందరవందరలో. ఓరకంట చూసే ఆ అమ్మాయిని కనిపెడుతున్నాను ఆ కళ్ళు నీళ్ళు చిమ్ముతున్నాయి. ఉబుకుతున్న దుఃఖం లోంచి యీదుకొచ్చే వెలితిచూపులు ఆకాశంలోకి చొచ్చుకుపోతున్నాయి.

మా రైలుతోబాటే ఆకాశంలో ఒక పొడిమేఘం పరుగులెడుతోంది. అందుకోబోయే కొండకొనకి అందీ అందకుండా తప్పించుకుని పారిపోతోందో: మనసు

లేక మొద్దుబారిన కొండని కవ్వించి కరిగించి కౌగలించుకుందామని అవస్థపడుతోందో – పసిగట్టలేక పోయేను ఆలోచనల కనుగుణంగా రకరకాల ఆకారాలలో నిమిషానికొకలాగ కనబడుతోందా మబ్బుతునక

"ఏమిటండీ ఆ పుస్తకం?" అంది ఆ అమ్మాయి ఆతృతగా యింత లేసి కళ్ళు చేసుకుని వంగి అట్టమీద బొమ్మ చూస్తూ.

"ఏదో యింగ్లీషు నవల" అన్నాను

"బోధపడి చావదు. దిక్కుమాలిన గోల" అని నవ్వేసింది

"మీరు చదువుకోలేదా?"

"ఏం చదువండీ వానాకాలం చదువూ.. ఆపాటి యింగ్లీషొస్తే. నాకీ ఖర్మేవేం.. ఎంచక్కా నేనూ అమెరికా వెళ్ళి..." అని నడుంమీద చేతులేసుకుని వూపుకుంటూ యేదో చెప్పబోయి సిగ్గుపడి నవ్వేసింది

"ఇంగ్లీషు చదువుకోడం అమెరికా వెళ్ళడానికా?" అన్నాను కొంచెం విస్తుబోతూ.

"మరెందుకండీ లేకపోతే... వంటింట్లో కిసరబిసర లనుకోడానికా... యింగ్లీషు రానివాళ్ళు అమెరికా వెళ్ళలేరు..."

"అమెరికా వెళ్ళకపోతే వచ్చే నష్టమేవిటి..?"

"అదేవిటండీ అలా అంటారూ!... అమెరికా అంటే పెద్దకిటికీ... అందులోంచి ప్రపంచం అంతా కనబడుతుంది. పద్నాలుగు భువనాలూ కళ్ళకట్టినట్టు కనబడతాయి అమెరికా వెళ్తే లోకాలన్నీ తిరిగినట్టే." అని చిన్నపిల్ల చెప్పినట్టు చేతులు తిప్పింది – వెక్కిరింతగా.

"ఆఁ అలాగా ... వినాయకుడు యెలుకమీద కూర్చుని తల్లిచుట్టూ తిరిగి భూవంతా తిరిగొచ్చేనన్నట్టు" అన్నాను వెటకారంగా.

"అహాఁ ... అలాగా" అని నవ్వేసింది.

విదేశాలు వెళ్తే మనకి ఒరిగిపోయేదేవిటండీ?" అన్నాను.

"అమెరికా వెళ్ళనివాళ్ళూ, ఇంగ్లీషు రానివాళ్ళూ. నూతిలోకప్పలు ...వుత్త కప్పలుకాదు...బావురుకప్పలు... అప్పలమ్మలు" అంది అకస్మాత్తుగా జేవురించిన మొహంతో హేళనగా పెదాలు బిగించి చిన్నవంక నవ్వునవ్వి, బరువుగా వూపిరిపీలుస్తూ.

నా కెందుకో ఆ మాటలు సహజంగా హాస్యధోరణిలో అన్నట్టు అనిపించలేదు. అట్టడుగున యేదో వేదన మూలుగుతోంది.

"పాఁపిట్టలెంత బాగుంటాయండీ!.. బొద్దుగా ముద్దుముద్దుగా...ఆ చిలిపి జీవాలకి దేవు డెన్నెన్ని రంగులద్దేడో చూడండి...ఎంత అందమైన రెక్కలిచ్చేడూ! ఎన్ని సరదాలిచ్చేడూ!"

అని కిటికీలోంచి చూడడం మొదలు పెట్టింది మళ్ళీ.

"పాలపిట్టా!" అంటూ నేనూ కిటికీ లోంచి చూసేను.

"ఆఁ...అదిగో... యిదొకటి ... యిందాక రైలుతో సవాలుచేసి యెగర బోయిన పాలగువ్వని మీరూ చూసేరు కదూ?" అని నా కళ్ళలోకి చూసింది.

"ఓ...అదా ... పాపం రైలుతో వుజ్జీపడి ఆయాసపడి అలిసిపోయింది" అన్నాను.

"అవునులెండి; వియ్యానికేనా సమ వుజ్జీ వుండాలంటారు ... విమానాల్లో సూర్యుడికన్న ముందు భూమిచుట్టొచ్చే వాళ్ళతో మనం పరుగులెత్తగలఁవా?... పొలం గట్లమీద తుప్పతుప్పమని గెంతుకుంటూ ఆడుకునే వెర్రిబాగుల ముఁద ఆ పాలగువ్వకి. యినపపట్టాల మీద జారిపోయే రైలుకి సాటా?" అంది_ జాలిగా నవ్వుతూ, పిచ్చిచూపులుచూస్తూ.

ఒకదానికొకటి పొత్తుకుదరవి ఆ మాటల తీరు నాకేం బోధపడలేదు.

"మీరెక్కడికి వెళ్తున్నారు" అన్నా ననుకోకుండా.

"హైదరాబాదు"

"మీ ఆయనేం చేస్తున్నారు"

"యూనివర్సిటీలో రీడరు"

"ఎక్కడనుంచొస్తున్నారు?"

"విశాఖపట్నం"

"నేనూ అక్కడే యెక్కేనే" అన్నాను.

"అవును - చూసేను" అంది.

ఇంకేం మాట్లాడాలో తోచక పేపరు విప్పబోయేను.

"పేపరూ యింగ్లీషేనా?" అంది నేను చదువులో పడతాననిలా వుంది.

"అఁ...ఏం?" అన్నా - మొహఁ వెత్తకుండానే.

"మీరేం చేస్తున్నారూ?"

"పోలీసు శాఖలో సీఐడీని."

"అబ్బో! అయితే మీలాంటివాళ్ళు ఫస్టుక్లాసుల్లో ప్రయాణంచేయాలి- ఈ థర్డుక్లాసేం ఖర్మ?"

"అవసరాల్నిబట్టి, మేము ఎందులోనైనా చేయొచ్చు!"

"అంటే?"

"అంతకన్న నేను చెప్పకూడదు"

"ఓ! అలాగా! అయితే. మీకు పిల్లలా?"

"లేరు" అన్నాను, యెందుకా - యీ ప్రశ్నలన్నీ వేస్తోందని కొంతసేపు తటపటాయించిఁది.

"మీ రెంతవరకూ ప్రయాణం?" అంది.

"హైదరాబాదే."

"మీరొక్కరే వెళ్తున్నారేం?"

"మరెవరొస్తారూ ... ఏవిఁటి మీరనేదీ!" అని తలెత్తిచూసేను.

"మీ ఆవిడో" అంది-మరెవరూ లేరా అన్నట్టు.

"ఆవిడెందుకూ - అన్నాను,

"ఎందుకా? నామొహంలావుంది ... మీరెందుకేం ... ఏం మాటలండీ ... మీ మగాళ్ళు...హుఁ..." అని విసుక్కుంది.

నావేపు చురచుర చూసి "మీరూ ఫారిను వెళ్ళేరా?" అంది.

"వెళ్ళేను"

"అమెరికా యేనా?"

"కాదు...ట్రెయినింగుకి స్కాట్లెండు వెళ్ళేను"

"మీ ఆవిడకి యింగ్లీషొచ్చా?"

"రాదు"

"రాదూ!... అయితే పుట్టింట్లోనే నన్నమాట మకాం"

"పుట్టింట్లో యేంఖర్మం...నిక్షేపంలా నాదగ్గరేవుంది."

"మీతోనే వున్నారా! ... మీ ఆవిడకి యింగ్లీషు రాదంటున్నారూ... వుత్తనే కోతలు - మీరు ఫారిను వెళ్ళలేదు" అని సందేహిస్తోంది.

"ఏం ... ఎందుకలా అడుగుతున్నారూ?"

"ఇంగ్లీషు రాకపోతే యెలాగండీ... మీకు నామోషీకాదూ? ... కష్టలతో కాపరం యెలాగండీ" అంది నవ్వుతూ, నలకపడిందంటూ కళ్ళొత్తుకుంటూ.

విదేశాలు వెళ్తున్న భర్తను సాగనంపడానికో, యెన్నాళ్ళకో విదేశాలనుండి తిరిగొస్తున్న భర్తను కలుసుకోడానికో వెళ్తోందనుకున్నాను.

ఏదీ శాశ్వతం కాదంటూ, కరిగిపోయే గతంలా పొలాలూ, యేర్లూ, గట్లూ, పుట్టలూ కంటిముందు కదిలి మాయ మవుతున్నాయి. పాతవి వెనక



బడుతున్నాయి, కొత్తవి ముందు కొస్తున్నాయి, మరుగునపడి కరిగి మాయమవుతున్నాయి. అయినా అంతులేని దృశ్యాలు అలా కంటిముందు కదిలిపోతూనేవున్నాయి. జీవితం తుదీ మొదలూలేని ప్రవాహం అని అలాంటప్పుడు యెవరూ చెప్పకుండానే స్ఫురిస్తుంది, బోధపడుతుంది. మతిచెడినవాడి వాగుడులాగ ఒక దృశ్యానికీ మరోదానికీ సంబంధం వుండదు. అతికిచూస్తే యేదో అర్థం చూచాయగా ధ్వనిస్తుంది, యేవో రహస్యాలు గుసగుసమని వినిపిస్తాయి. దేనిమట్టుకదే చూస్తే సముద్ర కెరటాల్లా నురుగులు కక్కుతూ విరిగిపడతాయి.

"యేవిఁటేవిఁటో తెగవాగుతున్నాను... ఘరేవఁనుకోకండి..., మా పెద్దన్నయ్య మీలాగే వుండేవాడు.. మిమ్మల్ని చూస్తుంటే. ." అని ఆగిపోయింది.

"ఫరవాలేదమ్మా" అనేశాను.

వినీవినబడనట్టు యింకా యేదో తనలో తానే గొణుగుకుంటోంది. నాకు చిన్న కునుకు పడుతోంది.

"ఏవండి-నిద్దరోతున్నారా?" అంది.

"ఏం?" అన్నాను తుళ్ళిపడి.

"ఆ వెధవపీనుగ యిందాకటినుండి చూస్తున్నాను — నావేపెందుకలా చూస్తాడూ? పిచ్చివెధవ, దొమ్మరివెధవ, వెకిలినవ్వులూ వాడూనూ తన్నాల్నుంది" అని దూరంగా మరోబెర్తు వేపు తీక్షణంగా చూసింది.

ఆ మీసం, పిల్లిగెడ్డం, వేషం, వాలకం చూస్తే వాడెవడో వుత్తరాదివాడిలా

వున్నాడు. నేను ఆవేపుచూడగానే యేమీ యెరగనట్టు మొహం తిప్పేసుకుని యెటో చూస్తూ మీసం దువ్వుకుని, పైపిన్ను సర్దుకుంటున్నాడు.

"వెధవచూపులూ వాడూనూ—నేనిక్కడుంటే కాల్చుకుతింటాడు—మీరు పడుకోండి" అంటూ నాబెర్తుమీదనుంచి లేచి, తండ్రినిలేపి తన బెర్తుమీద కూర్చుంది—వుత్తరాదివాడికి కనబడకుండా.

బెజవాడ చేరేసరికి చీకటిపడింది. వచ్చేపోయేవాళ్లూ, భోజనాలు తీసుకొచ్చే సర్వర్లూ అంతా కోలాహలంగావుంది. నేను భోంచేసి నాసీటుదగ్గర కొచ్చాను.

"ఏమండీ?"

"ఏం?"

"నాన్నమధ్య బెర్తులోకి యెక్కి పడుకోడం కష్టం—మీకు అభ్యంతరం లేకపోతే మధ్యబెర్తులో మీరు సర్దుకోండి. నాన్న కిందబెర్తులో పడుకుంటాడు."

"మరిమీరో?"

"మీ బెర్తుమీద పడుకుంటాను."

ఆడకూతురూ, ముసలాయనా సర్కసుఫీట్లెలాచేస్తారని, యిబ్బందైనా—'సరే'నన్నాను. ప్రయాణబడలికా, భుక్తాయాసం యేకమయ్యాయి. రైలు కుదుపులో అందరూ కునుకు తీస్తున్నారు. తెలివితప్పి తప్పనట్టు మగత నిద్ర పట్టింది నాకు. పైనజరిగేవీ బుర్రలో చెలరేగేవీ అన్నీ కలగాపులగమై కలా నిజం కలిసిపోయే కనికట్టు గారడీఅది. ఫెడీమని చప్పుడైంది. తిట్లూ, శాపనార్థాలూ వినబడ్డాయి. కలగంటున్నాననుకున్నాను.

"పశువా - బుద్ధిలేదూ - ఎద్దులా వున్నావు! వెధవా - యేం వీపోయేకాలంరా నీకూ" అని చెవినిబడి తుళ్ళిపడిలేచేను

ఆ అమ్మాయి బెర్తు మీదలేచి కూర్చుని యేడుస్తోంది. ఆవుత్తరాదివాడు భుజంమీద టర్కీ తువ్వాలుతో చేతులు తుడుచుకుంటూ వాడి బెర్తుదగ్గరకి వెళిపోతున్నాడు. మధ్యబెర్తులో యిరుక్కున్నానేమో లేవమోయి, తలబొప్పి కట్టి, కళ్ళు నులుపుకుంటూ మెల్లిగా కిందికి దిగేను. తారాజువ్వలా చివాల్న లేచిందా అమ్మాయి.

"నాన్నా నాన్నా - లేవండినాన్నా - మిమ్మల్నే" అని కంపించిన భూదేవిలా దద్దరిల్లి జలదరించిపోతూ పడుకున్న తండ్రి భుజాల్నిపట్టి వూపి లేపింది.

ముసలాయన బరువుగా కళ్ళు తెరవలేక. నుదురుచిట్లించి, ఆవలిస్తూ కూతురు వేపు చూసేడు. అమ్మవారు వూనినట్టు శివాలాడుతున్న కూతురుమొహం, కణకణలాడే కళ్ళూచూసి తెల్లబోయేడు.

"చూడండి నాన్నా - ఎనుబోతులాగ వెధవ, పందిలాగున్నాడు. యేంచేసేడో చూడండి. వెధవని తన్ని జుత్తుపట్టి యీడ్చిపారెయ్యండి నాన్నా—పోకిరీవెధవ



యేవఁనుకున్నాడో యేఁవో" అని తండ్రినివూపేస్తోంది.

"అర్థరాత్రప్పుడీ ఖాగోతఁవేఁవిఁటమ్మా? అబ్బ! పోయిపడుకో - వాడే పోయేడులే - ఊఁ పో పడుకో ఖర్మ" అని కూతుర్ని మందలించి పక్కకితిరిగి పడుకుని గుర్రుపెట్టి నిద్రపోయేడు–ముసలాయన.

"ఏవిఁటినాన్నా మీరూ - మీరడుగుతారా–నన్నేఅడగమంటారా–వాడి పరువు మంటా - నాన్నా నాన్నా" అని నెత్తి బాదుకుని బొళ్ళుమంది.

చీవఁకుట్టినట్టైనా లేక, పక్కకి తిరిగి పోయిన తండ్రినిచూసిఆశ్చర్యబోయేను. ముసలాయన నిద్దరమత్తులో వున్నాడు. మేలుకునివుంటే మాత్రం యేం చెయ్యగలడు? ఓపిక, బలంలేక తెల్లబోయి యేవీఁతోచక నిశ్చేష్టుడై పక్కకి తిరిగి పోయేడనుకున్నాను. ఎంత చేతకాక పోయినా యెవడేనా యేవీఁ జరగనట్టూరుకోగలడా? నాకేవిఁటో అంతా అగమ్యగోచరంగా, అయోమయంగా వుంది. ఆ అమ్మాయిని సముదాయించి, వూరుకోబెట్టి యేం జరిగిందో చెప్పమన్నాను.

"ఏం జరిగిందీ - నాపిండాకూడు–ఏం జెప్పమంటారు. ఎలా చెప్పగల్నండీ నాసిగ్గు బొగ్గుఁవ్వా" అంది పేంద్రించుకుంటూ నుదురు బాదుకుని.

"చెప్పకపోతే ఎలాగమ్మా? ఏవీఁ చెప్పకపోతే యేం చెయ్యగలం చెప్పండి" అని బుజ్జగించేను.

"వాల్తేరులో రైలెక్కిం దగ్గరనుండీ ఆవెధవ నాప్రాణాలు తోడేస్తున్నాడు- కొరివిచూపులూ వాడూను" అంది.

"అది సరేనమ్మా-ఏం చేసేడూ ?"

"వీడిమొహం తగలెయ్యా-ఓకన్ను తెరిచి బితుకు బితుకు మంటూనే ఆటూ యిటూ దొర్లుతున్నాను."

"ఊఁ"

"వచ్చి పక్కలో జొరబడ్డాడు."

"ఆఁ!... అమ్మ దొంగవెధవా... రాస్కెల్ !"

"కాళ్ళూ పాదాలూ రాసి మెల్లిగా... అబ్బ... సిగ్గుమాలిన చచ్చినాడు... నా కర్మ కాకపోతే,.. యేవిఁటిదంతా"

"వూరుకున్నారా ?"

"వూరుకోక యేం చెయ్యగలనూ... బిక్కచచ్చిపోయి యేం చెయ్యాలో తోచక కాలు జాడించి కసిదీరా తన్నేను- భటాచోరు వెధవని... కట్టుకున్నవాడు కాదంటే కన్నవాళ్ళకే నిష్ప్రయోజనం... అందరికీ లోకువ...అదుగు బొదుగు బతుకూ... యేంచెప్పుకున్నా యెవరూ వినిపించుకోరు... నేను జడ్డిదాన్ని. యాబరాసిని... నాదంతా పిచ్చివాగుడు. నా సొదెవరిక్కావాలి" అంటూ వుక్రోషంగా నా వేపు చూసి కొంగునోట్లో గుక్కుకుంటూ వెక్కి-వెక్కి యేడ్చింది

నాకు ఒళ్ళు మండింది. అందరూ గాఢంగా నిద్రపోతున్నారు. వృత్తరాది వాడు నిద్రనటిస్తున్నాడు - దగ్గరికి వెళ్ళి జబ్బలు కుదిపి లేవదీసేను.

"ఏయ్ మిస్టర్...ఏవిఁటి సంగతి?" అన్నాను భుజంమీద చెయ్యేసి.

వాడు తెలుగు రాదని హిందీలో వాగడం మొదలుపెట్టేడు — విసుగ్గా నా చెయ్యిని తోసేస్తూ... హిందీ నాకు రాదని యింగ్లీషులో వూదరగొట్టేను. కొంచెం బెదిరేడు. వినయంలో దిగేడు.

"ఆ అమ్మాయి పక్కలో జేరి... వెధవ్వేషాలేసేవా లేదా ?" అని గద్దించేను.

"లేదు" అన్నాడు.

"లేదూ ?... చెప్తావా చెప్పించమంటావా ?" అని గుడ్లెర్రజేసి చొక్కాకాలరు పట్టుకున్నాను.

"నేను బాత్‌రూముకి వెళ్లొస్తుంటే ఆవిడ కాలుతగిలింది... క్షమించండి... నేనూ మీలాంటివాణ్ణే మర్యాదస్తుణ్ణి ... అలాంటిపని చేస్తానా ? కావాలంటే చూడండి - అంటూ మనీ పర్సుతీసి తన విజిటింగుకార్డు చూపించబోయేడు.

"నీ భుజకీర్తులూ, నీ హోదాలూ యెవడిక్కావాలోయ్ పెద్దమనిషీ... నిజంచెప్పు" అన్నాను - పళ్ళు పటపట లాడిస్తూ.

"మీ రెవరింతకీ ? ఆ అమ్మాయి మీ కేఁవేఁనా అవుతుందా ?" అన్నాడు వెటకారంగా.

'నే నెవరో యిప్పుడే తెలుస్తుంది....

బద్మాష్! తప్పొప్పుకుని క్షమాపణ చెప్పుకో."

"చెప్పకపోతే?

యీ క్షణంలో రైలాపించి అరెస్టు చేసి జైలుకి పంపించగల్ను" అంటూ బూటుకాలు బెర్తుమీదపెట్టి కాలరుపట్టుకుని గుంజాయించేను.

అప్పుడే పడుకున్నవాళ్ళు ఈ గొడవతో విసుగ్గా లేస్తున్నారు.

"క్షమించండి. ఏదో అయిపోయింది... దయచేసి నన్నల్లరిపెట్టకండి. ప్లీజ్" అన్నాడు బతిమాలుకుంటూ, నలుగురూలేస్తే పులుసులోకి యెముక లేకుండా తంతారని భయపడి.

"చాల్లెండి రౌడీవెధవకి. . అయిన శాస్తి చాలు... వెధవనోట్లో నోరెడితే మనకే సిగ్గూ. రండి చాలు" అంటూ వెనక్కి లాగిందా అమ్మాయి.

అందరూ లేస్తే ఆ అమ్మాయిబతుకే నవ్వులపాలవుతుందని నేనూ భయపడి తగ్గిపోయేను. తెల్లారింది, సికింద్రాబాదులో రైలాగింది; మొహం కడుక్కుని కాఫీ తాగుదామని రైలు దిగేను. ఆ అమ్మాయి తెలివితప్పి పడుకుంది. పండుంపుల్ల నవుల్తూ ముసలాయనకూడా కొళాయిదగ్గర చేరేడు.

"అమ్మాయిని అత్తారింటికి దిగబెడుతున్నారా - తాతగారూ" అన్నాను.

"ఇంకా అత్తారిల్లేవిఁటిబాబూ పుట్టింటికే తీసుకెళ్తున్నాను" అన్నాడు దిగులుగా.

"అదేం!" అన్నాను తెల్లబోతూ.

"దాని బుర్రకొంచెం చెడిందిబాబూ. మతి స్తిమితంవుండదు ... వెర్రివాగుడూ

అదీను ... ఒక చేగొణుగుడు ..అందరి మీద అనుమానం. .అతగాడు అమెరికా వెళ్ళిందగ్గర నుండి అదేవాలకం...యీ జడ్డిమాలోకాన్ని అల్లుడుమాత్రం యెన్నాళ్ళు భరించగలడు బాబూ కొన్నాళ్లు పుట్టింట్లో వుంచి పంపండని నాతోపంపేసేడు...రాత్రి మిమ్మల్నేమీ చికాకుపెట్ట లేదుగదా? ... అంతామాకర్మ ... దాని అదృష్టం అలా బండలుబారింది." అన్నాడు ముసలాయన కూతుర్ని తలుచుకుని కుంగిపోతూ.

లేపినా లేవకుండా ముసలాయన అలా నిశ్చింతగా యెందుకుపడుకున్నాడో అప్పుడర్థమైంది.

"అల్లుడెక్కడుంటున్నాడూ?" అనడిగేను.

"యూనివర్సిటీలోనే ... అమెరికా అవీవెళ్ళి పెద్దపెద్దచదువులే వెలగబెట్టేడు ...యేచేటా దేశాలన్నీ తిరిగొస్తుంటాడు...అతగాడిదదో ధోరణి...ఏంచెప్పమంటారు? మనవాళ్ళన్నా మన అలవాట్లన్నా అతగాడికి అసహ్యం యీదేశం పందులగుడిసెట.. దీని వాలకం చూస్తే యిలా తగలడింది. .పరమాత్ముడి కృప అలావుందిబాబూ" అంటూ కొళాయి దగ్గర దోసిలితో నీళ్ళుపట్టి పుక్కిలించి మొహంకడుక్కుని కళ్ళు తుడుచుకున్నాడు.

ఎంతమంది మూర్ఖుల్ని యీ దేశం యెగుమతిచేస్తుందో అనుకుని నొచ్చుకున్నాను.

"అమ్మాయికి యింగ్లీషు చెప్పించండి . అన్నీ సర్దుకుంటాయి..."అని ముసలాయనవేపు చూసేను.

నివ్వెరబోయేడు. వాంపల్లిలో అందరం దిగి పోయేం.

"ఈ మారు హైదరాబాదు వచ్చినప్పుడు మీ అవిడని మా యింటికి తీసుకు రండేం.. . మరిచిపోకండేం" అంటూ యెడ్రసు రాసిచ్చిందా అమ్మాయి.

"తప్పకుండా రాబాబూ" అంటూ ముసలాయన కూతురితో వెళ్ళబోతున్నాడు.

జాలిగా, అమాయకంగా కృతజ్ఞత నిండిన చూపులతో వెళ్తూ వెళ్తూ చేతులు జోడించిందా అమ్మాయి.

"చదువుకో అమ్మా. . యింగ్లీషు చదువుకో... కాలేజీలో జేరు అన్నాను.

"నేనా ;... యింగ్లీషూ, చదువూ .. వుద్యోగం... నేనూ. .బాకురు కప్పని.. అప్పలమ్మని యెంత వెర్రిబాగులవారండీ" అని బావురుమని ఏడ్చినట్టుగా నవ్వింది.

నామనసు చివుక్కుమంది. కాదమ్మా! నువ్వు రెక్కలుపడిన పాలగువ్వవి అందామని నోటిదాకా వచ్చింది. అనలేక పోయేను.

ముసలాయన భ్రమపడ్డాడు. ఉత్తరాదివాడు అబద్ధమాడాడు. ఆ అమ్మాయి నిజమే చెప్పింది. ఇవన్నీ నాకొక్కడికే తెలుసు! ఎవరితో చెప్పుకునేది?